క్లుప్తంగా

రేపు ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో వీరబ్రహేంద్రస్వామి

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో శ్రీ వీరబ్రహేంద్ర స్వామి మందిరంలో పంచలోహ ప్రతిమ శివలింగం, మహా గణాధిపతి నాగేంద్ర స్వామి, శీతల పరమేశ్వరి అమ్మవారి నాలుగో వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం, విశేష పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం కార్యక్రమం, సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

పారదర్శకత కోసమే సూపర్ చెక్


పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

తాళ్లూరు (దర్శి): పంట నమోదు పారదర్శకత కోసం సూపర్ చెక్ చేయనున్నట్లు తహసీల్దార్ కె.నాగలక్ష్మి, ఏఓ బి.ప్రసాద్‌రావు తెలిపారు. తాళ్లూరు-1,2, విఠలాపురాల్లో క్షేత్ర పర్యటనలో భాగంగా రాండమ్‌గా పంటల వారీగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి, ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఖరీఫ్ 2024 సీజన్‌లో 7,870 ఎకరాల్లో 53 రకాల పంటలు ఈ-పంట నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2,879 మంది రైతుల క్షేత్రాలను నమోదు చేశామన్నారు. వాటి వివరాలు పరిశీలించి పొరపాట్లు లేకుండా పంటల వారీగా తనిఖీలు నిర్వహించామన్నారు. సర్వే నంబరు, విస్తీర్ణం, రైతుల వివరాలు, పంట రకం, నీటి సదుపాయం, పంటకాలం వంటి వివరాలతో కూడిన అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. వీఆర్వో ఎం. నాగలక్ష్మి, వీఏఏలు రాజునాయక్, వెంకట్రావు, అశోక్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఈవోఆర్డీగా శ్రీనివాసులు

పుల్లలచెరువు: ఇన్‌చార్జి ఈవోఆర్డీగా వై.శ్రీనివాసులను జిల్లా అధికారులు నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవోఆర్డీ శరత్‌బాబు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీ కావడంతో పుల్లలచెరువు కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసులుకు పూర్తి ఇన్‌చార్జి ఈవోఆర్డీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, ఉపాధి హామీ గ్రామసభల ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తింపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'మానవత' ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటరెడ్డి, సభ్యులు

దర్శి: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాజంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తలపాటి పురందేశ్వరి బీఎస్సీ నర్సింగ్ చదువుతూ అనారోగ్య కారణంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మానవత సభ్యులు ఆమె కుటుంబాన్ని సోమవారం కలిసి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధ్యక్షులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ట్రెజరర్ గొర్రెపాటి వేణు, సంస్థ ప్రతినిధులు ఎస్కే ఖాదర్ మస్తాన్, కె.జైహింద్‌రెడ్డి, జే. సుశీల, అన్నవరపు వెంకటేశ్వర్లు, రాచపూడి మోషే, గర్నెపూడి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

దొనకొండకు నిధులు కేటాయించాలి

దొనకొండ: దొనకొండ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా నాయకుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. దొనకొండ సీపీఎం శాఖ మహాసభలు కుందుర్తి చిన్న నరసింహులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని, విమానాశ్రయం అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, కార్మికులకు ఉపాధి చూపిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతర ఇటీవల మృతి చెందిన పార్టీ ప్రముఖులకు నివాళులర్పించారు. సీపీఎం జెండాను మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆవిష్కరించారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శులుగా వీవీ పురానికి చెందిన కోలా కిరణ్‌కుమార్, ఓబ్నాపురం ప్రాంతానికి చెందిన సీపీఎం శాఖ కార్యదర్శి కుందుర్తి చిన్న నరసింహులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు కర్నా వెంకటకృష్ణ, రాయని కోటేశ్వరరావు, ఫ్రాన్సిస్, కర్నా ఆంజనేయులు, చంటి, ప్రభాకర్, అంజిబాబు, ఏసుదాసు, రమణయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

- పుష్కలంగా పోషక విలువలు


గోంగూర పంట


కొత్తిమీర , కె.బుజ్జిబాయి, ఏఓ (ఇన్‌సెట్‌లో)

పెద్దారవీడు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు తప్పనిసరి. ఆకుకూరల సాగుకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. మండల పరిధిలోని కొత్తపల్లి, పెద్దారవీడు గ్రామాల్లో రైతులు పొలాల్లో తోటకూర, గొంగుర, కొత్తిమీర, చుక్కకూర, మెంతి వంటి ఆకుకూరలు విస్తారంగా సాగు చేస్తున్నారు. వాటిని అమ్మి ఆర్థికంగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఆకుకూరల్లో విటిమిన్లు, లవణాలు, మాంసకృతులు, పీచుపదార్థం మెండుగా ఉటుందని డాక్టర్లు చెబుతున్నారు. నీరు నిలిచే బంక మట్టి నేలలు సాగుకు పనికి రావని, ఈ నేపథ్యంలో ఆకుకూరల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తోటకూర: ఈ విత్తనాలు చాలా చిన్నవిగా ఉంటాయి. వీటిని ఇసుకతో కలిపి తయారు చేసుకున్న నేలలో విత్తుకోవాలి. ఎకరానికి 800 గ్రాములు సరిపోతాయి. 10 కిలోల ఇసుకను కలిపి మడులపై పలచగా చల్లుకొని దానిపై పలుచని పొరలా మెత్తటి మట్టి లేదా ఇసుకతో కప్పాలి.

కొత్తిమీర: కొత్తిమీర విత్తుకునేటప్పుడు విత్తనాన్ని రెండు బద్దలుగా చేయాలి. లేకపోతే గింజ అలస్యంగా మొలకెత్తి మొలక శాతం దెబ్బతింటుంది. దీని కోసం నేలపై గింజలను పోసి సున్నితంగా నేలకేసి రుద్దాలి.

మెంతికూర: ఇది పప్పు జాతి పంట. మొదటిసారి పొలంలో విత్తే ముందు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టిస్తే వాతావరణంలోని నత్రజనిని గ్రహించడానికి తోడ్పడుతుంది. దీని ద్వారా మెంతి కూర మొక్కల పెరుగుదల బాగుంటుంది.

పాలకూర: విత్తనాలకు 3.4 సెంటిమీటర్ల లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువ అయితే మొలకలు సరిగా రావు. ఎకరానికి నాలుగు లేదా ఐదు కిలోల విత్తనాలు సరిపోతాయి. పాలకూర పంట త్వరగా చేతికందుతుంది.

కరివేపాకు: విత్తనాలను పండు నుంచి వేరు చేసిన వెంటనే నేలలో విత్తుకోవాలి. ఆరిన తర్వాత విత్తితే మొలక శాతం బాగా తగ్గిపోతుంది. విత్తన 48 గంటల్లోపు నేలలో పదును చూసుకుని లీటరు నీటికి నాలుగు లీటర్ల పిండిమిథాలిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట తొలి దశలో కలుపు నివారించుకోవచ్చు. ఇలాంటి సస్యరక్షణ చర్యలు చేపడితే ఆకుకూరల్లో చీడపీడలు నివారించుకుని మంచి దిగుబడులు సాధించుకోవచ్చని ఏఓ తెలిపారు.

సస్యరక్షణ: ఆకుకూర పంటలకు తక్కువ మందు అవశేషాలు ఉండే పురుగు మందులను మాత్రమే వాడాలి. పేను బంక, ఆకుతినే గొంగళి పురుగుల నివారణకు రెండు మిల్లీలీటర్ల మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా వేప సంబంధిత పురుగుల మందులను వినియోగించుకోవాలి. ఆకుమచ్చ తెగులు (సర్కోస్పర మచ్చ) నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు మందు పిచికారీ చేసిన తర్వాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకుకూరలు కోయాలి.

నేల తయారీ ఎరువులు

ఆకుకూరల సాగు నేల తయారీ చాలా ముఖ్యం. మెత్తటి దుక్కు వచ్చే వరకు లోతు దుక్కితో పాటు 3,4 సార్లు సాధారణ దుక్కి చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల పెంట, 300 కిలోల వేప పిండి, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 10 కిలోల జింక్ సల్ఫేట్, రెండు కిలోల గ్రాన్యుబోర్, 100 కిలోల శుద్ధి చేసిన ట్రైకోటిర్మా, 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలి. తర్వాత నేలలో మట్టి పెళ్లలు లేకుండా చదును చేసుకుని ఆకుకూరలు విత్తుకోవాలి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కప్యూటర్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్‌సీ జంతు శాస్త్రం, బీఏ హిస్టరీ గ్రూప్‌ల్లో ఖాళీ సీట్లు స్పాట్ అడ్మిషన్‌ల ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అక్టోబర్ 7,8,9 తేదీల్లో మాత్రమే ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కురిచేడు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా చిన్నారులు స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో కూచిపూడి నృత్యాలు చేసి భక్తులను అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన తోట టేజల్ సాయి, అరసవల్లి నాగశ్రీలు చేసిన నృత్యాలపై భక్తులు ముక్కున వేలేసుకున్నారు. నేటి ఆధునిక యుగంలోనూ చిన్నారులు సంప్రదాయ నృత్యాలపై ఆసక్తి చూపడం అభినందనీయమని ప్రజలు చర్చించుకుంటున్నారు. తమ కళను ప్రజల ముందు ప్రదర్శించి అందరి మన్ననలు పొందాలనే సదుద్దేశంతో చిన్నారులు నృత్యం ప్రదర్శన చేయటం వారికి కళపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తుంది. వారి తల్లి దండ్రులు వారిని ప్రోత్సహించడంపై ప్రజలు అభినందిస్తున్నారు.

ఘనంగా దేవీనవరాత్రి ఉత్సవాలు


పెద్దదోర్నాల: అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు


ముండ్లమూరు: మారెళ్లలో..


దర్శి: లలితా త్రిపురసుందరీ దేవిగా దర్శనం ఇస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు


పెద్దారవీడు: అమ్మవారి వద్ద కుంకుమార్చన పూజ చేస్తున్న భక్తులు


దొనకొండ: కాశీ అన్నపూర్ణేశ్వరికి పూజలు చేస్తున్న భక్తులు

దర్శి: నియోజకవర్గంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి తెల్లవారు జామున ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూల మాలలతో అమ్మవారి అలంకరణ అందరినీ ఆకర్షించింది. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. పట్టణంలోని దద్దాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ తల్లి శాకంబరిదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు.

తాళ్లూరు మండలంలో..

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గుంటి గంగా భవాని అమ్మవారు శ్రీ గాయత్రీ దేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని అందంగా పూలమాలలతో అలంకరించారు.

ముండ్లమూరు మండలంలో..

మారెళ్ల గ్రామంలో శ్రీ భ్రమరాంబికాదేవి మాతా సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబికా దేవి శ్రీ ప్రత్యంగిరా మాతగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. తెల్లవారు జామున ఆలయంలో ప్రత్యేకాభిషేకాలు చేశారు. ఆయా ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డులో వెలసిన ఆనంద ఆశ్రమంలోని శివాలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఈశ్వరీదేవి కాశీ అన్నపూర్ణేశ్వరిగా సోమవారం దర్శనమిచ్చారు. అమ్మవారికి అష్టోత్తర శతనామావళి, సామూహిక కుంకుమ పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించి హారతులిచ్చారు. పూజారి మణిబాబు శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. దొండపాడు గ్రామానికి చెందిన దొండపాటి గంగయ్య వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. మంగళవారం అమ్మవారు లలితాంబికగా దర్శనం ఇస్తున్నట్లు భైరవానంద స్వామి తెలిపారు.

పెద్దదోర్నాల: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో వెలసిన అమ్మవార్లకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ వాసవీ మాత అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేకువజాము నుంచే అమ్మవారి మూలవీరాట్‌కు క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు బి.రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మండల పరిధిలోని మోట్ల మల్లికార్జునపురంలో అమ్మవారు శ్రీ లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లెలో వెలసిన శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు సోమవారం దర్శనమించారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ దాతలు, భక్తులు అమ్మవారి వద్ద కుంకుమార్చన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేసి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకమ పూజలు చేశారు. ముటకులలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవత ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల కమిటీ వారు దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


యర్రగొండపాలెం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సోమవారం భక్తులకు గాయత్రి దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం పేదలకు అమ్మవారిశాల వద్ద అన్న సంతర్పణం ఏర్పాటు చేశారు.

త్రిపురాంతకం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీబాలా త్రిపురసుందరీదేవి స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. త్రిపురాంతకం దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారు ప్రత్యేకంగా స్కందమాత అలంకారంలో మయూర వాహనంపై ఆలయ ఉత్సవం జరిగింది. జై బాలా జైజై బాలా అంటు భక్త జనులు నినాదాలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. ప్రతి రోజు వాహన సేవలు వైభవంగా జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. మంగళవారం షష్టి రోజు కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సింహ వాహనంపై శ్రీబాలా త్రిపురసుందరీదేవి ఉత్సవం జరుగనుంది.

కురిచేడు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబదేవి భక్తులకు గజలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. స్థానిక శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి దేవి శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు కురిచేటి సుబ్బారావు, నారాయణం వెంకటేశ్వర్లు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు మహిళలు కుంకుమార్చన, సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.


వైపాలెం: గాయత్రీదేవి అలంకరణలో వాసవీ అమ్మవారు


కురిచేడు: గజలక్ష్మిగా దర్శనం ఇస్తున్న శ్రీజ్ఞాన ప్రసూనాంబదేవి


దర్శి: శాకంబరీదేవిగా దర్శనం ఇస్తున్న పోలేరమ్మ అమ్మవారు


కురిచేడు: శ్రీరాజరాజేశ్వరిదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి


పుల్లలచెరువు: శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం


దర్శి: స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా దర్శనం ఇస్తున్న దద్దాలమ్మ అమ్మవారు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: రాష్ట్రంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నేరగాళ్లు కొత్త ఆలోచనలతో సామాన్యులను మోసం చేసేందుకు సిద్ధం అవుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజానీకం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్‌ఐ సంపత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక 'సాక్షి' విలేకరితో మాట్లాడారు. నూతనంగా కొరియర్ సర్వీస్ పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రజలను భయపెట్టి, దోచుకునే విధంగా మార్గాలను అన్వేషిస్తున్నారని తెలిపారు. ఎదో ఒక పేరుతో తొలుత అపరిచితుల నుంచి సెల్‌ఫోన్‌కు కాల్ వస్తుందని, అవతలి వ్యక్తి తాను విదేశాలను నుంచి మాట్లాడుతున్నానని నమ్మబలికి ఆకట్టుకుని కాల్ కట్ చేస్తాడని చెప్పారు. ఆ తర్వాత మరో అపరిచిత నంబర్ నుంచి కాల్ వస్తుందని, తాను కొరియర్ సర్వీస్ నుంచి కాల్ చేస్తున్నానని పరిచయం చేసుకుంటాడని, మీ పేరు మీద పార్శిల్ వచ్చిందని, మీకు కొరియర్ నుంచి రావాల్సిన వస్తువులేవీ లేవని, మీరు తెలిపినా, అవతలి వ్యక్తి వినకుండా మీ పేరు, ఫోన్ నంబర్ తెలిపి కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నాయనో, పేలుడు పదార్థాలు ఉన్నాయనో చెప్పి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ భయభ్రాంతులకు గురి చేస్తారని తెలిపారు. ఆదే సమయంలో మీ ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలను మీ ద్వారానే తెలుసుకుని ముంబై పోలీసులకు మీపై ఫిర్యాదు చేస్తున్నామని చెప్పి ఫోన్ కట్ చేస్తాడని వివరించారు. ఆ తర్వాల ముంబై సైబర్ క్రైమ్ పోలీస్ విభాగం నుంచి ఫోన్ చేస్తున్నామని మరో వ్యక్తి నుంచి కాల్ వస్తుందని, మిమ్మల్ని ఓ హోటల్ రూమ్, లేదా ఇంట్లోనే ఓ గదిలో ఒంటరిగా ఉంటే విచారణ చేపడతామని నమ్మిస్తాడన్నారు. అనంతరం స్కైప్ కాల్‌తో మాట్లాడుతూ మీ వ్యక్తిగత సమాచారం మొత్తం లాగేసుకుంటారన్నారు. ఆ తర్వాత ఫైన్ కట్టాలని మోసగించి మొత్తం డబ్బును తన ఆకౌంట్‌కు బదిలీ చేసుకుంటాడని తరుచూ జరుగుతున్న మోసం ఘటనలకు ఎస్‌ఐ సంపత్‌కుమార్ వివరించారు.

ఇవీ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నిజంగా ఎవరి మీదైనా పోలీసు కేసు ఉంటే సంబంధిత పోలీస్ అధికారి నుంచి లేక స్టేషన్‌లోని కానిస్టేబుల్ మాట్లాడుతాడు. వాట్సప్ కాల్, స్కైప్, వీడియో కాల్ అంటూ ఎవరూ చేయరు. అలా చేస్తే వారు సైబర్ నేరగాళ్లని అర్థం చేసుకోవాలి.
- ఇటాంటి మోసపూరిత కాల్స్ చేస్తే వెంటనే సమీప పోలీస్టేషన్‌కు సమాచారం అందించాలి. లేదా కుటుంబ సభ్యులతో విషయాన్ని పంచుకోవాలి.
- వాట్సప్ లో మీ కుటుంబసభ్యుల ఫోటోలను ప్రొఫైల్‌గా పెట్టకపోవడం మంచిది.
- అలాగే మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదు.
- మీకు తెలియని వ్యక్తి ఫోన్‌లో పరిచయమై రిక్వెస్టు పెడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆంగీకరించకూడదు.
- మీ వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో గొప్పంగా ఉంచాలి.
- బహుమతులు గెలుసుకున్నారని వచ్చే ఈ-మెయిల్ మెసేజ్‌లపై స్పందించరాదు.
- మీరు, మీ కుటుంబ సభ్యులు ఎక్కడికైనా వెళ్లినప్పుడు మీ పర్సనల్ డేటాను ఫోన్‌లో అనవసరంగా పొందపరచరాదు.
- సైబర్ నేరాల బారిన పడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 లేదా www.c ybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.